# పోయిన ఫ్లాస్కు

ఎమ్. ఉమామహేశ్వరరావు

నేను మొన్న వేసవిసెలవలలో మా అక్కయ్యగారి ఊరు హైదరాబాదు వెళ్లాను. మా వాసు గాడికికూడా శలవలవడంవల్ల రెండు రోజులు హైదరాబాదు ఊరు చుట్టి రావడములోనే గడిపేశాను. ఒక నాడు మా వాసు, వాడూ వాడి స్నేహితులూ కలిసి గండిపేట చెరువుకు పిక్‌నిక్ వెడుతున్నామని నన్నుకూడా వాళ్లతో రమ్మని పిలిచాడు. మా అక్కయ్యకూడా నన్ను ప్రోత్సాహ పరచడముచేత వాళ్లతో వెళ్దామనుకున్నాను. ఆ మర్నాడు ప్రొద్దున 8 గంటలకల్లా అంతా బయలుదేరి సాయంత్రానికల్లా తిరిగి వచ్చేద్దామని ప్లాను వేసుకున్నాము. ఆ సాయంత్రముదాకా అక్కడే గడపదలచాము కాబట్టి టిఫిను ఏదైనా తీసుకెళ్లడానికి నిశ్చయించుకున్నాము. మర్నాడు ప్రొద్దుననే టిఫిను తయారుచేశాము కాని కాఫీ పట్టుకెళ్లట మెట్లాగని సమస్య వచ్చి పడింది. మా అక్కయ్యగారింట్లో ఫ్లాస్కు లేదు. అందుకని కాఫీ టిఫిను తీసుకెళ్ళడము మానుకుందామనుకుంటూండగా మా అక్కయ్య "ఒరే వాసూ! ప్రక్కవాళ్లింట్లో మొన్ననే బొంబాయి నుంచి ఫ్లాస్కు తెప్పించామని ఆవిడ అంది. ఒకవేళ అదేమన్నా యిస్తుందేమో కనుక్కొస్తానుండండి" అంటూ దాన్ని తీసుకు రావడానికి వెళ్ళింది.

ప్రక్కింటావిడ చండిక అన్న సంగతి ఆ రెండురోజులలోనే నేను గ్రహించగలిగాను కాబట్టి ఆవిడ దానిని యివ్వదనే నేను రూఢిచేసుకున్నాను. అందులో అది కొత్తది కాబట్టి ఆవిడ యివ్వదనే మేమనుకున్నాము. కాని ఏ గుణాన ఉన్నదో ఏమో ఆవిడ దానిని యివ్వటానికి ఒప్పుకున్నది. కాని అంతా తయారయి నేనూ వాసూ



బ్లేడ్ కట్ చిత్రం —కోటంరాజు కృష్ణవేణి

వాడి స్నేహితులకోసము ఎదురు చూస్తూండేటప్పుడు ఎవరో వాడి స్నేహితుడొకడొచ్చి వాళ్ళ క్రికెట్టు మాచ్‌లో ప్లేయరు తక్కువయ్యాడని వాసుగాడిని రమ్మనమని చెప్పాడు. వాడు తాను మాచ్ ఆడటానికే వెళ్తాననీ, మాతో రావడము మానేశాననీ చెప్పి ఆ కొత్తవాడితో కలిసి వెళ్లిపోయాడు. నేను ఒక్కడినే వాసు స్నేహితులతో వెళ్లడానికి జంకాను. కాని, మా అక్కయ్య నేను మళ్ళీ ఎప్పుడోకాని గండిపేట వెళ్లడానికి అవకాశముండదని చెప్పి నన్ను వాసుస్నేహితులతో వెళ్లమన్నది. వాసు లేకపోవడమువల్ల మొదట నాకు కొంచెము నిరుత్సాహముగా ఉన్నా మొత్తముమీద ఆ రోజంతా మా పిక్‌నిక్ బాగానే జరిగిపోయింది.

సాయంత్రానికి మేమందరమూ తిరిగి వస్తూన్నాము. కొంతదూరము వచ్చినాకగాని నేను ఫ్లాస్కును అక్కడే మర్చిపోయి వస్తున్నానన్న సంగతి గుర్తుకురాలేదు. ఆ మాట గుర్తుకు వచ్చేటప్పటికి నా గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. ఎలాగైతేనేమి యీ శుభవార్త మా అక్కయ్యకు చేరవెయ్యగలిగాను. ప్రక్కింటావిడను సమాధానపరచడమెలాగని అనుకుంటూండగా మా వాసు కూడా వచ్చాడు. వాడంతా విని ఆవిడకు ఫ్లాస్కు ఖరీదు యిచ్చెయ్యడమే మంచిదన్నాడు. కాని ఫ్లాస్కు పోయిందని విన్నాకయితే ఆవిడ మనదగ్గరనుంచి రెట్టింపు ధర గుంజుతుంది. అందుకే ఫ్లాస్కు ఖరీదు ఆవిడ నోటిమీదుగానే చెప్పించిన తర్వాత పోయిందన్న సంగతి బయటపెట్టవచ్చుననుకున్నాము.



వర్షాకాలం —వేము ఎకి (10), కాకినాడ.

వాళ్ళ యింటికి నేనూ వాసూ వెళ్ళాము. ఆవిడ మమ్మల్ని కూర్చోమన్నది. మెల్లిగా ఆవిడను బాతాఖానీలోకి దించాడు వాసు. ఆ మాటా ఆ మాటా అయినాక వాసు "అత్తయ్యగారూ మీ ఫ్లాస్కు చాలా బాగుంటుందండీ! ప్రొద్దుననగా పోసిన కాఫీ సాయంత్రముదాకా ఏమాత్రమూ చల్లారకుండా అట్లాగే ఉందంటే నమ్మండి!" అన్నాడు. ఇంతలో నేనందుకొని "అంత మంచి ఫ్లాస్కు చాలా ఖరీదుంటుందేమో?" నన్నాను. వాడు "ఎంతో ఖరీదయితే బొంబాయినుంచి తెప్పించడమెందుకు? మామూలు ఖరీదుకే మంచిది తెప్పించిఉంటారు" అన్నాడు.

ఆ దెబ్బతో ఆవిడ ఉబ్బితబ్బిబ్బయిపోయి "ఎబ్బే ఎంతో ఖరీదులేదు. దాన్ని మొన్న బొంబాయి వెళ్ళినప్పుడు మీ మామయ్య ఆరు రూపాయలకే తెచ్చారం"ది.

ఆవిడ ఆమాట అన్నదో లేదో వాసుగాడు "మీ ఫ్లాస్కు పోయిందండీ! ఇదుగో ఖరీ" దంటూ ఆరు రూపాయలు లెక్కపెట్టి యిచ్చేసి "పదరా వెళ్దా" మన్నాడు. ఆవిడ నిర్ఘాంతపోయి చూస్తూండిపోయింది. ★